


# ది ఎండ్

2008లో ఓ రోజు నది మాసపత్రిక నించి ఫోన్ వచ్చింది. "నా పేరు జలదంకి ప్రభాకర్. నది మాసపత్రిక ఎడిటర్ని. ఓసారి వచ్చి మిమ్మల్ని కలవాలని ఉంది." ఓ గంభీరమైన కంఠం వినిపించింది.

శ్రీ ప్రభాకర్ మర్నాడు నన్ను కలిసారు. నా రచనలన్నా, వీరేంద్రనాథ్ రచనలన్నా తనకి బాగా అభిమానం అని, ఆంధ్రభూమి వారపత్రిక సర్క్యులేషన్ ఎదుగుదలకి మేమిద్దరం దోహదం చేసామని తను నమ్ముతానని, మా రచనలని చాలాకాలంగా ఫాలో అవుతున్నానని ఆయన చెప్పారు. నది మాసపత్రికకి ఎడిటర్‌గా వచ్చానని, తమ పత్రికకి ఏదైనా రాయమని కోరారు. ఆధ్యాత్మిక స్నిపెట్స్ కొన్ని పంపితే అవి నచ్చి అంతర్వాణి పేరుతో కొంతకాలం వాటిని ప్రచురించారు. తర్వాత ఇది పుస్తకంగా కూడా వచ్చింది.




కొద్దికాలానికి సీరియల్ అడిగారు. ఆయన్ని ఏ రకం సీరియల్ కావాలని అడిగితే డిటెక్టివ్ నవల రాయమని కోరారు. ఫోన్‌లో తన మేనేజింగ్ ఎడిటర్ శ్రీ రావ్ అవ్వాస్‌తో మాట్లాడించారు. వారు కూడా సస్పెన్స్ థ్రిల్లర్ అయితే బావుంటుందన్నారు. కానీ నా దగ్గర ఆ రోజుకి అలాంటి థీమ్ సిద్ధంగా లేదు. దాంతో రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల లంచగొండితనము నేపథ్యంలో అల్లుకున్న ఓ థీమ్‌ని చెపితే, దాన్ని వారు ఇద్దరూ ఓకే చేసారు. నది మాసపత్రికలో 'ది ఎండ్' పేర అది సీరియల్‌గా వెలువడింది.

ప్రభుత్వోద్యోగుల్లో అధికశాతం మంది లంచాలు తీసుకోవడం మనందరికీ అనుభవమే. జీవితకాలంలో ఒక్కసారైనా లంచం ఇవ్వని భారతీయుడే ఉండడు. డ్రైవింగ్ లైసెన్స్, ఇంటిప్లాన్ అప్రూవల్.. ప్రభుత్వంతో ముడిపడ్డ ఏ పనికైనా లంచం ఇవ్వక తప్పదు. వాటితో భారతప్రజలు ఎంతగా విసిగిపోయారంటే, చీకట్లో చిరుదీపంలా కనిపించిన అన్నా హజారే దీక్షకి ఢిల్లీలో ప్రజలనించి పెద్ద ఎత్తున మద్దతు లభించడంతో, ఆనాటి కాంగ్రెస్ పెద్దలు అది తిరుగుబాటుకి దారి తీయచ్చని కూడా భయపడ్డారు. అదే సమయంలో మిడిల్

ఈస్ట్‌లోని కొన్ని దేశాల్లో ప్రజలు విజయవంతంగా తిరుగుబాటు చేసారు. అందుకే దీనికి మద్దతు ఇస్తూ ఢిల్లీ వచ్చిన బాబా రాందేవ్‌ని ప్రణబ్ ముఖర్జీతో సహా ముగ్గురు కేంద్రమంత్రులు ఢిల్లీ విమానాశ్రయంలో కలుసుకున్నారు.

ఐతే ఓసారి ఏంటీ - కరప్షన్ బ్యూరోకి పట్టుబడితే మాత్రం ప్రభుత్వోద్యోగి తను అంతదాకా లంచాలుగా తీసుకున్న దాంట్లో చాలా భాగం లంచంగా వాళ్ళకి సమర్పించి బయటపడాలి. (అనేకసార్లు దినపత్రికల్లో ఏసిబి వాళ్ళు లంచం తీసుకున్నారన్న వార్తలని మీరూ చదివే ఉంటారు) లేదా నేరం ఋజువై జైలుకి వెళ్ళాలి. శిక్ష పడేవారి శాతం చాలా తక్కువని కూడా అనేకసార్లు దినపత్రికల్లో చదివాను. మా ఇంటి సమీపంలోనే ఓ ప్రభుత్వోద్యోగి ఇంటిమీద ఏసిబి రెయిడ్ జరిగింది. ఆదాయానికి ఆస్థులు లభించడంతో అతన్ని రిమాండ్‌కి పంపారు. ఐతే కేస్ ఋజువవక తిరిగి ఉద్యోగంలో చేరి ప్రమోషన్స్ పొందాడు. అప్పుడు అనిపించింది ఈ వ్యవస్థమీద నవల రాయాలని.

ఒకవేళ నిజాయితీ గల ఏసిబి అధికారి కేస్‌ని నీరుకార్చకపోయినా లేదా రాజకీయ మద్దతు లభించకపోయినా, అప్పుడు పట్టుబడ్డ ప్రభుత్వోద్యోగికి శిక్ష పడితే అతని కుటుంబం ఎలాంటి సంక్షోభంలో పడుతుంది అనే ఆలోచనకి నవలా రూపమే 'ది ఎండ్' అదే సమయంలో దినపత్రికల్లో జలమండలి అక్రమాల గురించి చాలా వార్తలు వచ్చాయి. వాటన్నిటినీ కట్ చేసి దాచి ఈ నవల్లో వాడాను. కాబట్టి చాలా భాగం వాస్తవాలు. సూక్ష్మంగా కథ.

జలమండలిలో పనిచేసే దేవమునిని ఏసిబి అధికారులు ట్రాప్ చేసి పట్టుకున్నారు. తమ తండ్రి తమకి పాకెట్ మనీగా డబ్బెలా ఇస్తున్నారో తెలీని పిల్లలకి అతని దొంగబుద్ధి తెలిసింది. ఇది అందరికీ తెలీడంతో స్కూల్లో, కాలేజీలో తోటి వాళ్ళముందు వాళ్ళు అవమానంగా ఫీలవుతారు. బంధుమిత్రుల ముందు భార్య సర్వమంగళ పరిస్థితి దిగజారింది. ఆస్థిపాస్తులు, నగలు ఏసిబి అధికారులు జప్తుచేసి దేవమునిని జైలుకి పంపారు. నిరాశ్రయురాలైన సర్వమంగళ క్రమంగా పూటకి గతిలేని స్థితికి దిగిపోతుంది. ఓ రోజు ఫైవ్‌స్టార్ హోటల్‌కి వెళ్ళి తిన్న సర్వమంగళ జీవనం కోసం ఇంటి అరుగుమీద మిరపకాయ బజ్జీలని వేసి అమ్ముతూ, తన కూతుర్ని చూడటానికి వచ్చే కుర్రాళ్ళు తప్పనిసరై కొంటున్నారన్న నిజం తెలిసినా ఏం చేయలేని నిస్సహాయురాలైంది. వాళ్ళ జోకులని మౌనంగా భరించడం అభ్యసించసాగింది. దాన్ని భరించలేక పెద్ద కూతురు కౌసల్య ఆత్మహత్య చేసుకుంటుంది. చిన్నకూతురు అమూల్య విధిలేక బాలకార్మికురాలిగా మారింది. ఇది కొందరు ప్రభుత్వోద్యోగులకైనా కనివిప్పు కలిగించవచ్చనే ఆశతో వారి కుటుంబ కోణంలోంచి లంచాలు తీసుకోవద్దనే సందేశంతో రాసాను. కానీ దళసరి చర్మం ఏర్పడ్డ వాళ్ళే వాళ్ళల్లో అధికం అని మనందరికీ తెలిసిన విషయమే. ఒక్కరు కూడా ఇది చదివి భయపడి ఉండరు.

దొంగ తను పట్టుపడడనే ధైర్యంతోనే ఎలా దొంగతనానికి దిగుతాడో అలా తను పట్టుపడడనే ధీమాతోనే ప్రభుత్వోద్యోగికూడా లంచం తీసుకుంటాడు. అందుకే దేవముని మిత్రుడు ఠాగూర్ పాత్రద్వారా ఆధ్యాత్మిక కోణములోంచి కొంత మంచిని బోధించాను.

లిపి పబ్లికేషన్స్ మే 2010లో దీన్ని పుస్తకంగా వెలువరించింది. వెల రూ.100/ - ప్రస్థుతం ఈ పుస్తకం మార్కెట్లో లేదు.

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***

Post your comments